కథానిక

# పందెం జత

ఉటుమళ్ల కామేశ్వరరావు

కోరుకొండ భూస్వాములలో నరసయ్యగారు పేరుమోగిన మనిషి. స్థిరాస్తి లక్షలమీదే అని చెప్తారు. దానికి తగిన చరాస్తి ఉండనే ఉంటుంది. పైగా పిల్లికి బిచ్చం పెట్టడని వాడుక. ఆయన పొలం పనులేమిటో, పాడి పంట లేమిటో, పాలికాపు లేమిటో, రైతు లేమిటో, ఆయన గొడవేగాని మిగత గొడవల జోలికి పోడు. క్రితంసారి ఎలెక్షన్లలో ఆయన్ని దించుదామని చాలామంది చూశారు. "అలాగే, అలాగే" అని మాటలతో జరిపివేసి, అంతగా నిర్బంధ పెట్టేవాళ్ళకి ఏదో వ్యవహారంలో మారుబేరం చూపించి మళ్ళీ ఆ విషయం ఎత్తకుండా చేసుకొన్నాడు.

నరసయ్యగారి పెద్ద కుమారుడు దుర్గయ్య. అతనికేనా కాస్త అక్షరజ్ఞానం కలుగుతుందేమోనని తండ్రి మహాచెడ్డ తంటాలు పడ్డాడు. కాని ఉపయోగం లేకపోయింది. "ఇంతకీ మనకి చదువెందుకు, వ్యవసాయమే మనకి చదువు" అని నరసయ్యగారు సరిపుచ్చుకొన్నాడు.

రెండోవాడైన గోవిందానికేనా రెండు ముక్కలు అబ్బుతాయేమో అని ఆయన శ్రమపడ్డాడు. కాని వంశపారంపర్యంగా వచ్చిన విద్యేకాని మరో విద్య అబ్బలేదు. లక్ష్మీ సరస్వతులు ఒక్కచోట ఉండవు అన్న సామెతే ఉంది కదా.

దుర్గయ్యకి పెళ్ళి ఏ ఏడాటికి ఆ ఏడాదే తలపెడుతున్నాడు తండ్రి. కాని జరగకుండానే ఇంతకాలం గడిచిపోయింది. అతనికి పద్దెనిమిదేళ్లు నిండేయి. చట్టంప్రకారం వయస్సు వచ్చిందన్నమాట. ఇక తప్పదన్నాడు నరసయ్యగారు. పైగా వచ్చిన సంబంధం రాజాలాంటిది. వాళ్లూ పిల్ల జమీందారులు. వాళ్ళది ద్వారపూడి. టెలిగ్రాముల మీద సంబంధం నిర్ణయమయింది, పదిహేను వేలు కట్నం ఇచ్చేటట్లు. దానికి తగినట్టుగానే లాంఛనాలు ఉంటాయి. పెళ్ళి అయిదు రోజులూ జరిగితే గాని సరదా తీరదన్నారు.

నరసయ్యగారు పిల్లలకి పెళ్ళి చెయ్యడం ఇదే ప్రథమం. అతనికి ఒళ్లు పై తెలియలేదు. కట్నం అంతా పెళ్ళికే ఖర్చుపెట్టడమే కాకుండా మరింత కూడా ఖర్చుచేసి పేరు తెచ్చుకోదలచేడు. పెళ్ళి ప్రయత్నం బ్రహ్మాండంగా జరుగుతూంది. జరూరు ఖర్చులకని పదివేలు చేతితో పట్టుకొన్నాడు. గుంటూరు నుంచి బోగంమేళాలు, నెల్లూరినుంచి సన్నాయి మేళం, విజయనగరం నుంచి సంగీత పాటకులు ఏర్పాటు చేశారు. హరికథలు, వినోదాలు, ఉత్సవాలు, బాణాసంచా మొదలైన వాటికి లెక్కే లేదు. పెళ్ళి పూర్తయేక చేతిది యెంత పడిందో చూసుకోవలసిందే!

కౌసుల కాపురస్థలం గాదరాడ. కోరుకొండకి ఆరుమైళ్ళ దూరంలో ఉంది ఆ గ్రామం. కౌసులు పెద్ద కులంవాడు ఇంకా యిరవై ఏళ్ళు నిండలేదు.

కౌసుల గుడిసెకి నరసయ్యగారు తన సొంత బావమరిదిని పంపించి బండి కట్టించుకు రమ్మన్నాడు. వెళ్ళే ముందు ఏవో కొన్ని సంగతులు చెవిలో చెప్పేడు. బావమరిది సైకిలు మీద బయలుదేరేడు. గాదరాడ చేరి కౌసుల గుడిసె దగ్గరకి వెళ్ళి "కౌసులు ఉన్నాడా?" అని కనుక్కొన్నాడు.

"ఇంట్లో కౌసులున్నాడండి బాబయ్యా, బుల్లిగాడు లేడండి!" తల్లి సమాధానం చెప్పింది.

ఇంటిలో అంతా పెద్దకొడుకు బుల్లిగాడిదే పెత్తనం. వాడికి చెప్పందే సాధారణంగా కౌసులు గడప అవతల కాలుపెట్టడు.

కౌసులు ఇవతలకి వచ్చి చూడగా చేటంత మొహం అయింది. ఆశ్చర్యంతో "బాబయ్యగారండి! తమరే ఇలాగు దయచేశారేంటండి!" అన్నాడు.

"ఖులాసాగా ఉంటున్నావురా?"

"తమరి దయండి బాబయ్యగారూ! అంత కన్నా ఏముంధండి!" అన్నాడు కౌసులు ఆనందంతో.

"నరసయ్యగారు కబురు పంపించేరురా." అన్నాడు బావమరిది, తల ఓరగా పెట్టి చుట్ట పొగ వదులుతూ.

"చిత్తం బాబయ్యగారు! సెలవేంటండి."

"కట్టు మరి."

"తమవంటివోరే మా బీదసాదని కనికరించకపోతే ఎలాగండి బాబయ్యగారు బతికడం? మాకే పొలంపనులు తీరక చచ్చిపోతున్నామండి. ఇప్పుడే నేను దుక్కి చేసుకొంటున్నామండి. తీరుబాటుంటే బాబయ్యగారి మాటకి ఎదురు సెప్పడమేనండి. కాకిచేత కబురు పంపిస్తే రెక్కలు కట్టుకువచ్చి వాలవేంటండి!" అన్నాడు కౌసులు అనేక భావాల మధ్య కొట్టుమిట్టాడుతూ.

"కాదురా! నిన్ను తీసుకురమ్మన్నారురా నరసయ్యగారు."

"బాబయ్యగోరు! తమరలా సెలవిత్తే ఎలాగండి మాబోటివాళ్లు బతకడం. మంచిమాట సెలవిచ్చారు! పొలం పనులు ఆడ్డిపోతాయండి బాబయ్యగోరు" అని కౌసులు మళ్ళీ కారణం తెలియజేశాడు.

"డబ్బు ఇయ్యరనా?"

"ఎంత మాటన్నారండి బాబయ్యగోరు. నన్ను సంపేసినా అంత నొప్పుండదండి అయ్యగోరు! అలాంటిమాట అనేశారు తమరు!" అని కౌసులు ఎంతో నొచ్చుకొన్నాడు.

"అయితే యింకేం కట్టు మరి!"

"ఎటూ కాని స్థితి వచ్చిందే!" అనుకొంటూ కౌసులు తెగించి "సిత్తం బాబయ్యా!" అని కంగారుగా "పెళ్ళికేనండి?" అన్నాడు.

"లేదు... కాదు... అదంతా నాకు చెప్పలేదు. నన్ను బండి కట్టించుకు రమ్మన్నారురా. అంతే!"

"తమరికి తెలియందేముంటుందండి బాబయ్యగోరు సెప్పరుగాని."

"ఏమోరా నాకు చెప్పలేదని మొదటే చెప్పలేదూ?"

"అలాగంటే ఎలాగండి బాబయ్యగోరు. ఎక్కడికో సెలవియ్యరేంటండి మరి?"

"ఆరిని కనుక్కొంటే ఆరే సెలవిత్తారురా. నేనా ఏంటి సెలవిచ్చేవోణ్ణి, మానేవోణ్ణి."

"బాబయ్యగోరు యిలాగ మాట్లాడితే ఎలాగండి బాబయ్యా! తమరి పాదాలకడ బతికేవోళ్ళం. పోనీ, బుల్లిగాడికి సెప్పి వొద్దామంటే ఊళ్ళో లేడు. రేపుగాని రాడు. రానంటే బాబయ్యగారికి ఏం కోపం వత్తుందో, ఏంటోనండి మరి." అంటూ కౌసులు తీరని సమస్యలతో కొట్టుకొంటూ, బుర్ర గోక్కున్నాడు.

"ఇంకా ఎంతసేపురా నిలబడమన్నావు?"

"అయ్యో! బాబయ్యగారు తమ సెలవైనాక మళ్ళీ మారుసెప్పడం ఉందేంటండి. వత్తున్నానండి... సిత్తం! ఎడ్లకి దాణా పెట్టుకొనిత్తారా మరి. తమరు ముందు బేగి దయసేత్తారేమో తొక్కుడుబండిమీద, నేను ఎనకనుంచి వత్తానండి" అన్నాడు కౌసులు.

"కలిసే పోదాంరా, తొందరేముంది."

"అంతకన్నానండి బాబయ్యగోరు!" అని కౌసులు వేగిరం గుడిసెలోకి వెళ్ళేడు. ఎడ్లజతకి కుంచెడు తవుడు, రెండుసేర్ల గుగ్గిళ్ళు, గోలేలలో పోశాడు. గుడిసెలోంచి గూటి బద్దలుతీసి, దూరాన్న చెట్టుకింద నిలబెట్టిన బండికి తగిలించి, వెదురుచాప కట్టేడు.

బండి వచ్చి ఎదుట నిలబడింది. తెల్ల గుర్రాలలాగున్న ఎడ్లని చూసి బావమరిది విస్తుపోయి, మనస్సులో "అందుకే!" అనుకొన్నాడు.

కౌసులు సైకిలు బండిలోకి ఎక్కించి తాటితో బిగించి కట్టేడు.

బావమరిది బండి ఎక్కేడు. అతని అనుజ్ఞ తీసుకొని కౌసులు బండిలో కూర్చున్నాడు.

నరసయ్యగారి వాకిటిలో అడుగు పెట్టగానే బండి పెళ్ళికని కౌసులుకి తెలిసింది. గుండె జారిపోయింది. "కమ్మోరు!" అని మనస్సులో అనుకొని, "తీరా కడతానని మాట యిచ్చాను" అని గొణుక్కొన్నాడు.

బండి వచ్చిందని నరసయ్యగారికి తెలిసి పాలపొంగులాగు వచ్చిన సంతోషాన్ని దిగమింగి, గుండెలు చేతితో రాసుకొన్నాడు. వీధి వసారాలోకి వచ్చి కౌసులు పెట్టిన దండాలను

అందుకొని "ఏంరా బాగుంటున్నావా? మీ అన్నయ్యో?" అన్నాడు.

కౌసుల మనస్సు పరిపరివిధాల పోయింది. అసలు మాటకి జవాబు చెప్పడం మరిచిపోయేడు. "కామందులవారు మమ్మల్ని తిన్నగా బతకనియ్యరండి" అన్నమాటలు వాటంతట ఇవతలకి వచ్చేయి.

నరసయ్యగారికి నవ్వు ఆగలేదు. మీసాలు అటుఇటు సవరించి "అదేంటిరా." అన్నాడు.

"తమరికే తెలుసునండి దొరగోరు. నన్నడిగే దేంటండి. పెళ్ళికని నాకెవ్వరూ సెప్పలేదండి బాబయ్యగోరు." అన్నాడు కౌసులు.

"ఏతేమట్టుకు ఆడదానిలాగు మాట్లాడతావేంటిరా"

"పెళ్ళికయితే మా అన్నయ్య కట్టనిస్తాడండి దొరగారు." అన్నాడు కౌసులు.

"ఊరికే వెళ్ళిగావడమేరా! అందులో ఏముందిరా! మా బళ్ళతోపాటు నీ బండీకూడా వెళుతుంది. దానికేముంది లెద్దూ."

"సిత్తం బాబయ్యగోరు. అలాగే సెలవిత్తారండి మరి—" అని తతిమాభావం నోటరాక చింపిరి తల గోకుకొన్నాడు కౌసులు.

నరసయ్యగారు ఇంటిలోకి వెళ్ళిపోయేడు.

ఇల్లంతా కోలాహలంగా ఉంది. పెళ్ళికి వందబండి బయలుదేరుతుంది. రాత్రి రెండుజాము లప్పుడు బళ్ళు కట్టదలచుకొన్నారు. కృష్ణపక్షమే కాని అప్పటికి వెన్నెల బయలుదేరుతుంది. రాత్రి ఎవళ్ళకీ నిద్రలులేవు. ఎవడేనా నిద్రపోతూంటే, వాడితో చనువున్న రెండోమనిషి, వాడిచెవిలో నీళ్లు పోసేవాడు. ఇద్దరికీ కొత్తసేపు సరదా దెబ్బలాట.

ముహూర్తాన్ని బళ్లు కట్టేరు. నరసయ్యగారు ఎంతో ముచ్చటపడి ఏడాదికిందటే కొన్న భారీ ఎడ్లజత బండి ఎక్కేడు. బండి తేలికగా అట్టతో చేసినట్టు ఉంది.

నరసయ్యగారితో కౌసులు "అయ్యగోరు! నాబండి సివర్ని వస్తదండి" అన్నాడు.

"ఏంటిరా, అమ్మాయిలాగు జంకుతున్నావు. నీబండి సివరనెందుకు మాబండే సివరఉంటుంది. పోనియ్యి." అన్నాడు నరసయ్యగారు.

వందబండి కదిలింది. కౌసులబండి నరసయ్యగారి బండికి పదిబళ్ళ ముందర ఉంది. పుచ్చపువ్వులాగు వెన్నెల కాస్తూంది. బళ్లు నడిపిస్తున్నారు. ఎడ్లమెళ్ళో గంటల, మువ్వల జిలుగు మోతలతో కొందరికి నిద్ర తేలిపోగా, మరి కొందరికి జోలపాటలాగు నిద్ర ముంచెత్తుకు వస్తూంది "బండి వడిగా నడిపించు" అని ఒక ఆసామి, "జోరుగా పోనియ్యరా!" అని మరి ఒకడు "చూస్తావేంటి ఎదుటి బండిని తప్పించరా" అని ఇంకొకడు, "ఆడవాళ్ళబండీని ముందెళ్ళనిస్తావేంటిరా!" అని వేరే ఆసామి, ఈ మోస్తరుగా పోటీలకి పోతున్నారు.

కౌసులబండికి వెనకాలబండి తప్పించి ముందుకు వచ్చింది. కౌసులు "సరే కాని"మ్మన్నాడు. ఇంతటిలో నరసయ్యగారి బండి శరవేగంతో వస్తూంది. ఎడ్లు రంయ్‌రంయ్ అంటూ వచ్చి కౌసులబండిని తప్పించాయి. కౌసుల బండిలో వాళ్లు "చూస్తూ ఊరుకుంటావేంరా" అని కొత్త పాడిచేరు. "ఎడ్లు చచ్చిపోతాయని నేనే పట్టాయిస్తున్నానండి బాబూ. అవి ఊరుకుతానే ఉన్నాయండి" అన్నాడు కౌసులు. "విడిచిపెట్టెయ్యి ఒకసారి" అన్నాడు బండిలోని ఒక పెద్దమనిషి. "తట్టరా!" అన్నాడు మరొక ఆసామి, కౌసులు రెండెడ్లమీద చెయ్యి ఉట్టినే వేశాడు. అవి మోరలు, తోకలు యెత్తి పరుగు పుచ్చుకొన్నాయి. ముందు బళ్లవాళ్లకి ఉషారుపుట్టింది. వెనక బళ్లు తప్పుకోకుండా యెడ్లని పరిగెత్తిస్తున్నారు. కొత్త సందు దొరికినప్పుడల్లా కౌసులబండి ముందుకి దాటుతూంది. అన్ని బళ్ళముందర నరసయ్యగారిబండి ఉంది. వెనకనుంచి కౌసులబండి వస్తూండడం కనిపెట్టేడు నరసయ్యగారు. బండివాడితో "ఊఁ. పోనియ్యరా!" అన్నాడు. మైసూరు యెడ్లలాగున్న నాటుయెడ్లు పరుగుకి లంకించుకొన్నాయి. కౌసులబండిని బళ్లన్నిటిని తప్పించి వచ్చి చూశాటప్పటికి నరసయ్యగారి బండి కనబడలేదు. "అలాగా సరే!" అని నోరు తెరిచేడు. గొంతు కూర్చున్నాడు. అరిచేతులతో యెడ్ల పిర్రలమీద పెడీమని తట్టాడు. యెడ్లు చెంగున యెగిరేయి. దువాలింపు మొదలు పెట్టేయి. కౌసుల యెడ్లయొక్క మహిమ యెరిగున్నవాడు

కాబట్టి నరసయ్యగారు బండివాడితో "ఏ మాత్రము వడి తగ్గించవద్దు" అని ఆజ్ఞ ఇచ్చేడు.

ఒక మైలు దూరం పరుగెత్తినా కౌసులకి నరసయ్యగారి బండిజాడ కనబడలేదు. తక్కిన బళ్లన్నీ వెనక ఎక్కడో ఉన్నాయి. మనస్సులో ఒక్క క్షణం విచారించేడు. ఉద్రేకం పుట్టుకు వచ్చింది. "నా ఎడ్ల జతతో పందెం వేద్దామనే కదా నరసయ్యగారు నన్ను ఇరికించేడు. ఆ సంగతి చెప్పకుండానే అర్థమౌతూంది. ఈ పందెమేదో తేలిపోవాలి" అని తలపోసి, కొరడా ఎత్తి చెళ్లుచెళ్లున ఎడ్లని అంటించేడు. ఎడ్లు గుర్రాలలాగు దూకుతున్నాయి.

నరసయ్యగారు దూరంనుంచి కౌసుల బండిని చూసి బండివాడితో "వెళ్లనియ్యరా!" అన్నాడు. బండివాడు ఎడ్లని కొరడా తాడు మడిచి కర్రతో బాదివేశాడు. బండి వాయువేగంతో పోతూంది.

నరసయ్యగారు రెండేళ్ల క్రితం ఒక మంచి ఎడ్ల జతని కొన్నాడు. కాని అవి కౌసుల ఎడ్లతో సమానంగా లేవని విన్నమీదట ఏడాది క్రితమే వాకబు చేసి చేసి రెండు జతలను కొని వాటిలో మంచివాటిని ఎంచి జతగా చేశాడు. ఇప్పుడు బండికి కట్టిన జోడా అదే. నరసయ్యగారికి అసలు పశువులంటే ప్రాణం. అందులో ఈ జత అంటే మరీ ప్రాణం. వాటికి దగ్గిర ఉండి మరీ దాణా పెట్టిస్తాడు. ఏ కాలంలోనైనా సరే గుగ్గిళ్లు తప్పవు. వారానికొకసారి తెలకపిండి పడుతూంటుంది. ఆ ఎడ్లు మేస్తూంటే ఆయనకి బ్రహ్మానందం.

కౌసుల ఎడ్లు తెల్లగా నందులలాగున్నాయి. వాడు కావలిస్తే తన తిండి లోటు చేసుకొంటాడు కాని వాటికి పెట్టవలసిన వాటిలో ఒక్కపరకైనా తగ్గించడు. అతనంటే ఎడ్లకి ఎంతో ప్రేమ. ఎక్కడ ఉన్నా సరే అతను పిలుస్తూంటే పరుగెత్తుకొంటూ వస్తాయి. వాడి బండిని గొప్పవారు కట్టించి అద్దె మాటకేముంది, ఇనాం ఇచ్చిపోతూంటారు. అంత పేరుపడ్డ ఎడ్లు.

నరసయ్యగారు చాలకాలమయి కౌసుల బండితో పందెం వెయ్య దలచుకొన్నాడు. కౌసులే ఒప్పుకోడం లేదు. అంతకంటే ముందు వాడి అన్న ఒప్పుకోడంలేదు. "పందేలకి వెళ్ళవద్దు. అంత గొప్పోరితో పోటీలకి పోకూడదు" అంటాడు అన్న. అయినా చిల్లర పందేలు తప్పడం లేదు. కాని ఏదయినా నరసయ్యగారితో మట్టుకు కౌసులు పందెం వెయ్య దలచుకోలేదు. నరసయ్యగారు తన జత గొప్పతనం రుజువు చేసుకోదలచుకొన్నాడు. సమయం చూసి పందేని కని చెప్పక, ఏమీ యెరగనట్టుగా, ఊరికే బండి కట్టుకు రమ్మన్నాడు. తీరా వచ్చేక రంగంలోకి దింపేడు.

కౌసుల ఎడ్ల జత పరుగెత్తుతూంది. కోలమూరుదాకా వచ్చేడు కాని నరసయ్యగారి బండిని తప్పించలేకపోయేడు. ఇహ వాడికి ఒళ్లు తెలియలేదు. ఊడిన తలగుడ్డ మళ్ళీ బిగించేడు. రెండు బూతులు వదిలిపెట్టేడు. ఎడ్లని బాదివేశాడు.

దూరంగానుంచి గమనిస్తూన్న నరసయ్యగారు "ఆరి వీడి ముండమొయ్యా!" అని ఆశ్చర్యపోతూ, తోలమని బండివాడికి ఆజ్ఞ ఇచ్చేడు. బండివాడు తెగ బాదివేశాడు. కాని కౌసుల బండి దగ్గిరపడింది. రెండు బళ్ళూ ఒకదాని వెంట ఒకటి రెండు ఫర్లాంగులు పరుగెత్తేయి. కౌసుల బండి పక్కని చేరింది. రెండు బళ్లు సమంగా అర మైలు దూరం పరుగెత్తేయి. దుమ్ము లేచిపోయి వెనకనున్న వేమీ కనబడలేదు. బండిలో వారు కూడ ఎడ్లని బెదిరించి పరుగెత్తించడానికి పూనుకొని రణగోల చేశారు. బండివాళ్లు ఎడ్లని కుమ్మివేశారు. ఎలాగయితే యేమి కౌసుల బండి ముందు పడింది. నరసయ్యగారికి ఒళ్లు మండి పోయింది. బండి వాణ్ణి తెగతిట్టివేశాడు. బండివాడు ఎడ్ల తోకలు మెలియబెట్టేడు బండి మేఘాల మీదినుంచి ఎగిరి పోతూంది. రెండు మైళ్ళ దూరం పాటు కౌసుల బండిని అంటిపెట్టుకొనే వెళ్ళింది. రాజమహేంద్రవరం వచ్చింది. అప్పటికి తెల్లవారింది. ఊరు చూసి కౌసులు పల్లెటూరి ఎడ్లు జంకేయి. ఇక నేముంది! నరసయ్యగారి బండి ముందుకి పడింది. ఎడ్లని ఆపవద్దన్నాడు. బండి జోరుగా సాగిపోతూంది.

ఎక్కడో రెండు మైళ్ళ దూరాన ఒక అరడజను బళ్లు పోటాపోటీలుగా పరుగెత్తుకొని

వస్తున్నాయి. వాటిలో ఒక బండి చక్రం లేచిపోయింది. బండిలో వాళ్లు బోర్ల పడ్డారు. వాళ్ళకోసం మరొక బండి ఆగింది. మిగతావి దౌడు తీస్తున్నాయి.

రాజమహేంద్రవరంలో కౌసులు బండిని నెమ్మదిగా పోనిచ్చేడు. "ఎవరి మీదకన్నా వెళ్ళిందంటే లేనిపోని రొస్టు. గోప్పోరు వారెలాగేనా సర్దుకొంటారు. మనకెలాగు" అని మనస్సులో అనుకొన్నాడు. కాని కడుపులో ఉడికి పోతూంది. ఆ పట్టణం దాటింది. ఇంతటిలో వెనక వచ్చిన నాలుగు బళ్లు కూడా కౌసుల బండిని కలుసుకొన్నాయి. కౌసులు "ఇదా సంగతి!" అన్నాడు, ఎడ్లు రెండింటిని అరచేతులతో చరిచేడు. ఎడ్లు పౌర మెత్తేయి. "ఏమిటి కౌసి! నరసయ్యగారి బండి తగితే దాకా వడి తగ్గడానికి లేదు" అన్నాడు. యేమాత్రం తగ్గినా కొరడా మడమతో బాది వేస్తున్నాడు. నరసయ్యగారి బండి ధవళేశ్వరం దగ్గర పొడగట్టింది. కౌసులకి ఒళ్లు భగ్గుమంది ఎడ్ల తోకలు మెలివేశాడు. బండిలో వాళ్లు రణగోల చేసివేస్తున్నారు. ఎడ్లు బెదిరి పరుగెత్తుతున్నాయి. ఈ సంగతి చూసి నరసయ్య బండివాడికి ఉషారిచ్చాడు. బండివాడు శాయశక్తులా తంటాలు పడుతున్నాడు. బండిలో వాళ్లు చిందులు తొక్కుతున్నారు. ఎడ్లు గాలపు ఎత్తేయి.

కౌసుల బండి దగ్గరికి వచ్చి వేస్తూంది. నరసయ్యగారు "పరుగెత్తించరా!" అని బండివాడి మీద కేకలు వేశాడు. బండిలో అందరి దృష్టి ఎడ్లమీదే ఉంది. కాని లాభం లేకపోయింది. కౌసుల ఎడ్లు గాలపుచేసి ముందుకుపోయాయి. వాటి వెంట నరసయ్యగారిబండిపరుగెడుతూంది. చెట్లు, పుట్టలు, డొంకలు, పొలాలు, ఇళ్లు, వాకిళ్ళు వెనకపడుతున్నాయి. రెండు మైళ్ల పాటు ఏకబిగిని ఎడ్లు పరుగెత్తేయి. మెత్తకొళ్లు పడినట్లుగా బండివాడికి తోచింది. కౌసుల ఎడ్లు కూడ అలసి పోయినట్లుగా కనబడ్డాయి. కాని పందేలు! ఏమిచేస్తారు! ఇంతటిలో ద్వారపూడి ఫ్యాక్టరీల దర్శనమయింది. నరసయ్యగారు మరో దరువు కొనిమ్మాడు. బండివాడు మళ్ళీ ఎడ్లని బాది వదిలివేశాడు. ఏదయినా లాభం లేకపోయింది. కౌసుల ఎడ్లు ద్వారపూడి చేరుకొన్నాక ఒక ఫర్లాంగు వెనకపడింది నరసయ్యగారి బండి. కౌసుల ఎడ్లు గెలిచాయి. పెళ్ళివారి విడిదికి రెండుబళ్ళూ చేరేయి.

చింతచెట్టు నీడని బండి విప్పేడు కౌసులు. రెండు ఎడ్లూ నేలమీద పడిపోయేయి. నురుగులు కక్కుకొంటున్నాయి. మెడలు నేల మీద చూచి గుడ్లు వెళ్ళబెట్టేయి. ఎంత పని చేశాను అని విచారించేడు కౌసులు. "అన్నకి తెలుస్తే ఏమి కొంబడతాడో! పైగా, అన్నకి చెప్పకుండా బండి కట్టుకొచ్చాను!" అని దిగులుపడ్డాడు. అతను చిన్నగా నరసయ్యగారి దగ్గరకి వెళ్ళేడు.

నరసయ్యగారు గౌరవంతో చూశాడు.

కౌసులు "ఎడ్లని నిష్కారణంగా సంపేశానండి అయ్యగోరు! బతుకుతాయో బతకవోనండి. కళ్ళు తేలవేసి పడిపోయినాయండి."

"అవే లేస్తాయిలేరా" అన్నాడు నరసయ్యగారు.

"దాణా పెట్టిస్తే లేస్తాయేమోనండి! ప్రభువులు దయసేయించాలండి!" అన్నాడు.

నరసయ్యగారు తన దగ్గర ఉన్న మనుష్యులకి చెప్పి కౌసులు అడిగినంత తవుడు, ఉలవలు, తెలకపిండి వెంటనే ఇమ్మన్నాడు.

కౌసులు ఎడ్లని లేవగొట్టి దాణా పెట్టేడు. నీళ్ళు పెట్టడంకోసం కాలవ దగ్గరకి తీసుకు వెళ్ళేడు. కాలువంతా తాగివేస్తున్నా యనిపించింది. అతను తిరిగి వచ్చి వాటిని బండి చక్రాలకి కట్టి, వట్టిగడ్డి పడవేశాడు. ఎడ్లు నములుతూండగా, కౌసులు నెమ్మదిగా నరసయ్యగారి దగ్గరకి వెళ్ళేడు.

"ఎడ్లకి దాణా పెట్టేవుట్రా!" అని పలకరించేడు నరసయ్యగారు, పెదిమెల మధ్యని చుట్టని వేళ్ళతో తిప్పుతూ.

"చిత్తం బాబయ్యగారు! దాణా తినేసి ఎన్ని నీళ్ళు తాగేయో లెక్కలేదండి" అని చేతులతో అభినయిస్తూ తెలియజేశాడు కౌసులు.

"అలసిపోయేయి పాపం. ఏలినవారు బండి తెమ్మంటే జంకి పోయానండి" అన్నాడు కౌసులు.

"జంకిపోతే ఎలాగరా, పందెంజతని దగ్గిర పెట్టుకొని?" అన్నాడు నరసయ్యగారు మీసాలని అటు ఇటు సర్దుతూ.

"ఏమోనండి బాబయ్యగారు, మా అన్నయ్య కోప్పడతాడండి పందెం వేశానని తెలుస్తే."

"తెలిస్తైన నాగన్నేరా వాడు." అన్నాడు నరసయ్యగారు వెటకారంగా.

"బాబయ్యగారూ! వాడుకనక ఊరుకొంటే ఎడ్లు గెలుస్తాయండి ఏమండి నేనా" అన్నాడు కాసులు గర్వంగా.

"అవునురా. నువ్వు ఏదన్నా చెల్లుతుందిరా" అన్నాడు ఆయన వేరే ఏమీ అనలేక.

"బాబయ్యగారూ! అంతా తమదయేనండి." మాదేముందండి తమ దయ కాకపోతే!" అన్నాడు కాసులు విధేయతతో.

"ఒరే కాసులూ! నువ్వు అడిగింది ఇచ్చేస్తాము కాని ఆ జోడాని ఇచ్చేయి" అన్నాడు నరసయ్యగారు ప్రకటించని ఆశతో.

"బాబయ్యగారు! ఏదో ఇంత కూడెడుతున్నాయండి, కూడెట్టేవి ఇచ్చుకుంటూరండి యెవరేనా? ఇలాగ బతకనియ్యండి బాబయ్యగారు, తమరి చలవేనండి ఇదంతా." అన్నాడు కాసులు నమ్రతతో.

"నీకు ఇష్టమైతే నేరా" అన్నాడు నరసయ్యగారు.

"చిత్తం బాబయ్యగారు! మాకష్టం ఉంచుకోకండా అవి బతికిస్తున్నాయండి" అన్నాడు కాసులు.

"ఇదుగోరా కాసులూ! గెలిచినందుకు బహుమానం" అంటూ నరసయ్యగారు జేబులోంచి పచ్చకాగితం తీసి అందించేడు.

కాసులు నూరురూపాయలనోటు అందుకొని తన కళ్ళని తాను నమ్మలేక పోయేడు.

నరసయ్యగారు నవ్వు ఆపుకోలేక పోయేడు.

# ఉపనిషద్వాణి : రవీంద్రుని సౌందర్యోపాసన

దేవులపల్లి కృష్ణశాస్త్రి

ఉజ్వలమైన ఉపనిషద్వాణిని పాశ్చాత్య లోకంలో వినిపించి, కొత్త ఆశా, ఆనందమూ, మానవుడంటే గౌరవమూ, అక్కడివారికి కలిగించినాడు ప్రచారక పరమేష్ఠి వివేకానందులు. ఆయన ఒకచోట అంటారు: నవయుగ ప్రవక్త రామమోహనరాయలను తాను అంతగా మెచ్చుకునేందుకు కారణం, అతని విజ్ఞాన సంస్కృతులకీ సందేశానికీ వేదాంతాన్ని పునాదిగా నిర్మించుకోవడమే అని. రామమోహనరాయలు ఒకనాడు తనతోటలో ఉయ్యాల ఊగుతూ ఉంటాడు. అప్పుడు బాలుడైన దేవేంద్రనాథటాగూరు, అంటే రవీంద్రుని తండ్రి, అక్కడికి వస్తాడు. వచ్చి ఉయ్యాల ఊపుతాడు. రామమోహనుడు ఉయ్యాలనుంచి దిగి, తేజస్వియైన ఆ పిల్లవానిని దానిమీద కూర్చోపెట్టి తానూపుతాడు, "ఇంక నీవంతు, నాపని చేయవలసినవాడ వింక నువ్వు!" అని. ఈ సంఘటన చాలా సామాన్యమైనదైనా, ధర్మక్షేత్రంలో రామమోహనుని కార్యతత్పరతా, చింతా, శీలమూ అతని అనుచరుడైన ఆ పిల్లవానికి సంక్రమించినట్లు సూచిస్తున్నదని ఒక బుద్ధిమంతుడంటాడు దేవేంద్రనాథుని జీవితంలో ప్రతి నిమిషమూ ఉపనిషద్వాణితో మ్రోగిపోతూ ఉంటుంది. దేవేంద్రుని తపఃఫలం రవీంద్రుడు. ఆ వేదాంతసారం రవీంద్ర కవి మనఃక్షేత్రంలో ఇంకగా ఇంకగా మొలకలెత్తి పెరిగినవే అతని సుందర కావ్యాలన్నీ. అతని కావ్యసృష్టి అంత అవిశ్రాంతంగా సాగిందంటే అతని కార్యోత్సాహం మానవ లోకానికి శ్రేయోదాయకంగా ఉందంటే, ఉపనిషత్సందేశం నిశితంగా నిండుగా అతను గ్రహించడం వల్లనే అని విజ్ఞులంటారు.

రవీంద్రుడు సౌందర్యోపాసి. విశ్వమంతా ఆయనకు సుందర కావ్యముగానో చిత్రపటముగానో గోచరించినట్లు ఆయన రచనలవల్ల స్పష్టముగా గ్రహించవచ్చును. చిన్నతనమునుంచీ